తాయి. పార్టీ నిర్మాణశక్తిని పటిష్ఠం చేయాలనే పార్టీ సంకల్పం అతడున్నంతకాలమూ నెరవేరదు. ఇంకా విచ్ఛిన్నమవుతుంది.

ఏనాటికైనా బసవపున్నయ్య ఒక పెద్ద ముఠాతో బయటికి పోతాడనేది ఈనాటి నా జోస్యం. ఆనాటికి పార్టీ ముక్కలుముక్కలవుతుంది.

ఇప్పటికే పార్టీ అతనిద్వారా ఎంతమందినో పోగొట్టుకున్నది. చదలవాడ పిచ్చయ్యతో మొదలుకొని, కంభంపాటి జూనియర్, రావి నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి గ్రూపు, కొరపాటి, సి. వి. కె. రావుగారు మొదలైనవారు. అంటే ఈ కామ్రేడ్స్ తప్పిదాలు లేవనిగాదు. తక్కిన తప్పిదాలనైతే పార్టీ క్షమించేదే. కాని బసవపున్నయ్యకు వ్యతిరేకులుగాబట్టి వాళ్ళుబయటికి పోయేవరకూ బసవపున్నయ్యకు నిద్రవుంటుందా?

ఏనాటికైనా బసవపున్నయ్య వాగ్ధాటికి, నిరంకుశత్వానికి లొంగకుండా ప్రస్తుతనాయకత్వం నిలద్రొక్కగలిగితే ఎంతైనా పార్టీకి మోక్షముంటుంది.

---

గల్పిక

# గాడిదపిల్ల కోమలం

గోరా శాస్త్రి

గాడిదకు కోమలమని ఒకపిల్ల వుండేది. గాడిదపిల్ల కోమలం.

ఒకప్పుడు గాడిదకు తెలివొచ్చి, సంఘంమీద తిరగబడి విప్లవంచేసింది; అడ్డగాడిదలకు స్వేచ్ఛ కావాలని ఆందోళన చేసింది.

అందుకని గాడిదపిల్ల కోమలం గుర్రపిల్లల్లే పెరిగింది. అన్ని సౌఖ్యాలూ అనుభవించింది. రెండుపూటలా నంబరుబియ్యంలాంటి ఉలవలూ, వేయించిన కందిపప్పులాంటి గడ్డీ తింది. మైదానాలమీద షికార్లుకొట్టింది. తెలివీ విద్యావున్న యువగాడిదలతో సావాసం చేసింది.

పేరూ ప్రతిష్ఠాలేని ఏవో అడవుల్లోదని వచ్చిన ఒక యువక గాడిదతో కోమలానికి స్నేహం కలిసింది. ఈ యువకగాడిద ఒకనాడైనా ఒళ్లువంచి చాకిరేవుమూటలు మోసిన పాపానకూడా పోయి ఎరగదు.

కోమలం చేసిన ఈ స్నేహం గాడిదకు నచ్చలేదు. తను కోమలానికివ్వదలిచిన స్వేచ్ఛ యిటువంటిది కాదు. ఒకప్పుడు తను గాడిద ప్రపంచంలో విప్లవం బోధించి, అందుకై తన జీవితం ధారపోసినమాట నిజమే. కాని విప్లవజీవితంమీద అసహ్యంచేతనే తానిన్నాళ్ళూ విప్లవాన్ని బోధించినట్లు గాడిదకి ఇవాళ తెలిసింది.

తన ఇన్నాళ్ళ జీవితానుభవమూ వృథా ఐంది. సైకాలజీలో తన పాండిత్యంకూడా పనికి రాకుండా పోయింది. ప్రేమ యింత దుర్మార్గమైనదని తను అనేక అడ్డ గాడిదలను ప్రేమించినప్పుడు తెలిసిరాలేదు...

రోడ్డు చివర యువకగాడిద నిల్చునివుంది. గాడిద పరుగెత్తి వెళ్ళి కలుసుకుంది.

“నీగురించి అంతా మా కోమలం చెప్పింది. నిజానికి నాకూడా నువ్వంటే ఎంతో అభిమానం. నా సానుభూతి సర్వదా మీ యిద్దరిపట్లనే వుంది.”

యువకగాడిదకి ఆ మాటలు అర్థంకాలేదు.

“నువ్వేమంటున్నావో నాకు తెలీడంలేదు. నీ సానుభూతి నా కెందుకూ? మీ కోమలాన్ని చూస్తే, నాకు పరమరోత! ఆ సంగతి నీకు తెలుసు ననుకొన్నాను” అంది.

గాడిదకి కోపంవచ్చింది. కొమ్ముల్తో యువకగాడిదని పొడవబోయింది.

“నీకు కొమ్ము లెక్కడివి?” అని వికటంగా నవ్వింది యువక గాడిద.

మర్నాటినించీ గాడిదపిల్ల కోమలానికి ఉలవలూ లేవు; పచ్చిగడ్డీ లేదు. ★